సాక్షి
అనంతపురం
ఆదివారం ၊ 4 ၊ ఫిబ్రవరి ၊ 2024



రాష్ట్రస్థాయిలోనూ రాణించాలి

'ఆడుదాం ఆంధ్రా' రాష్ట్రస్థాయి పోటీల్లోనూ జిల్లా క్రీడాకారులు రాణించాలని కలెక్టర్ గౌతమి సూచించారు.

8లో



టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.9°/17.1°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

ఎన్నికల సన్నద్ధతపై దృష్టి

- ముందస్తు చర్యలపై అధికార యంత్రాంగం కసరత్తు
- పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు

సార్వత్రిక ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సంసిద్ధతపై దృష్టి పెట్టింది. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు ముందస్తు చర్యలపై కసరత్తు చేపట్టింది. ఏర్పాట్ల పరిశీలనకు జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.


కళ్యాణదుర్గంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్న జెడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఎన్నికల నిర్వహణకు అధికారులు సమాయత్తమవుతున్నారు. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో తాడిపత్రి, రాప్తాడు, ఉరవకొండ నియోజకవర్గాలను సమస్యాత్మక నియోజకవర్గాలుగా గుర్తించారు. ఇక జిల్లా వ్యాప్తంగా 2,213 పోలింగ్ కేంద్రాల్లో 19 కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా ప్రాథమికంగా గుర్తించారు. సమస్యాత్మక నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన పటిష్ట చర్యలపై జిల్లా యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ప్రధానంగా పోలీసు బందోబస్తు, ప్రత్యేక నిఘా, తదితర ఏర్పాట్లపై చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి నివేదికను అధికారులు సిద్ధం చేస్తున్నారు. మరోవైపు అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి, రాయదుర్గం నియోజకవర్గాలు ఎక్స్‌పెండేచర్ సెన్సిటివ్ ప్రాంతాలుగా గుర్తించారు. ఈ నాలుగు నియోజకవర్గాల్లో మద్యం, నగదు, సామగ్రి (చీరలు, వస్తువులు) పంపిణీ అధికంగా ఉంటుందని, వాటిని నియంత్రించేందుకు చేపట్టాల్సిన పకడ్బందీ చర్యలపై అధికార యంత్రాంగం నివేదిక సిద్ధం చేస్తోంది.

పీఎస్‌లలో వసతుల కల్పన

జిల్లా వ్యాప్తంగా 22 పోలింగ్ స్టేషన్లలో వసతులు లేవు. ఇందులో ఉరవకొండ నియోజకవర్గంలో ఒకటి, అనంతపురం అర్బన్‌లో ఒక పీఎస్‌లలో అవసరమైన ఫర్నీచర్ అందుబాటులో లేదని గుర్తించారు. అనంతపురం అర్బన్‌లోని ఒక కేంద్రంలో విద్యుత్ సరఫరా లేదని, మరో 12 పీఎస్‌లలో, రాయదుర్గం నియోజకవర్గంలోని ఒక పీఎస్‌లో దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు లేవని, అనంతపురం అర్బన్‌లోని 5 పీఎస్‌లలో టాయ్‌లెట్లు లేవని, ఒక పీఎస్‌లో నీటి సరఫరా లేదని గుర్తించారు. వీటిలో సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టారు.

చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా

సరిహద్దు ప్రాంతాల నుంచి జిల్లాలోకి డబ్బు, మద్యం అక్రమంగా రవాణా కాకుండా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా సరిహద్దులోని 10 చెక్‌పోస్టులను బలోపేతం చేశారు. అదే క్రమంలో ఆయా చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు.

జేఎన్‌టీయూలో కౌంటింగ్ కేంద్రాలు

జేఎన్‌టీయూ కళాశాలలో నియోజకవర్గాల వారీగా ఎన్నికల సామగ్రి పంపిణీకి కౌంటర్లు, ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో కళాశాలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇప్పటికే సందర్శించారు. కేంద్రాల ఏర్పాటుకు అనుకూలంగా ఉండే గదులను పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రతపై అధికారులకు ఆదేశాలిచ్చారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా

వజ్రకరూరు: ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆరా తీశారు. శనివారం ఆయన మండలంలోని పీసీ కొత్తకోట, పీసీ ప్యాపిలి, రాగులపాడు, పందికుంట, తట్రకల్లు, గంజికుంట, వజ్రకరూరు, కొనకొండ్ల, గూళ్యపాళ్యం తదితర గ్రామాల్లోని పలు పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లలో సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ రఫీ, ఎంపీడీఓ విజయలలిత, మండల సర్వేయర్ మంజుల, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.


రాగులపాడులో పోలింగ్‌కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ కేతన్‌గార్గ్

ముందస్తు చర్యలు చేపట్టాం

ఎన్నికల నేపథ్యంలో అవసరమైన చర్యలు ముందస్తుగా చేపట్టాం. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు జరుగుతున్నాయి. జిల్లాలోకి మద్యం, డబ్బు అక్రమ రవాణా జరకుండా సరిహద్దుల్లో పది చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు వాటి బలోపేతానికి చర్యలు తీసుకున్నారు. సమస్యాత్మక నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాలు, షాడో పోలింగ్ కేంద్రాల వద్ద వీడియోగ్రఫీ, పటిష్ట నిఘా, బందోబస్తు ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సిద్ధం చేస్తున్నాం. జేఎన్‌టీయూ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలు, నియోజకవర్గాల వారీగా డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాం.

– గౌతమి, జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్

న్యూస్‌రీల్

జేఎన్‌టీయూ (ఏ) ఆధ్వర్యంలో 'ఈసెట్'


ప్రొఫెసర్ భానుమూర్తికి నియామకపత్రాన్ని అందజేస్తున్న వీసీ శ్రీనివాస రావు

అనంతపురం: ఏపీ ఈసెట్ ప్రక్రియ ఈ ఏడాది జేఎన్‌టీయూ (ఏ) ఆధ్వర్యంలో సాగనుంది. గత ఏడాది, అంతకుముందు ఏడాది వర్సిటీ ఆధ్వర్యంలో ఏపీ ఈఏపీసెట్ నిర్వహించారు. తాజాగా ఏపీ ఈసెట్ అప్పగించారు. ఈఏపీసెట్ బాధ్యతను జేఎన్‌టీయూ (కేకు కేటాయించారు. ఈసెట్ రాష్ట్ర చైర్మన్‌గా ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు (జేఎన్‌టీయూ ఏ వీసీ), రాష్ట్ర కన్వీనర్‌గా ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తిని నియమితులయ్యారు. ప్రొఫెసర్ భానుమూర్తి గతంలో ఈసెట్ కన్వీనర్‌గా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. 2015 నుంచి 2021 వరకూ వరుసగా ఏడు దఫాలు జేఎన్‌టీయూ (ఏ) ఆధ్వర్యంలో ఏపీ ఈసెట్ సాగింది. 6 సార్లు కన్వీనర్‌గా భానుమూర్తి వ్యవహరించారు. తాజాగా మరో దఫా అవకాశం దక్కడంతో ఈసెట్ చరిత్రలోనే అత్యధిక సార్లు కన్వీనర్‌గా నియమితులైన ఘనత సాధించారు. ఈ సందర్భంగా రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్, వర్సిటీ డైరెక్టర్లు ఆయనను అభినందించారు.

దివ్యాంగులకు ఉద్యోగ మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని దివ్యాంగ నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈ నెల 7న ఉదయం 10.30 గంటలకు వివిధ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ.కళ్యాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల యువతీ యువకులు ఆ రోజు బయోడేటా, విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులు, ఆధార్‌కార్డుతో ఉపాధి కల్పన అధికారి కార్యాలయానికి చేరుకోవాలని కోరారు.

5న ఉద్యోగ మేళా

స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ సంస్థలో క్రెడిట్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 5న ఉదయం 10.30 గంటలకు ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి ఎ.కళ్యాణి ఓ ప్రకటనలో తెలిపారు. రూ.14 వేల వేతనం ఉంటుందని, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల పరిధిలో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలు ఒరిజినల్, జిరాక్స్, ఆధార్‌కార్డు తీసుకుని ఉద్యోగమేళాకు రావాలని కళ్యాణి కోరారు.

305 సెల్‌ఫోన్ల అందజేత

- దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిన అనంత పోలీసులు


బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ

అనంతపురం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో అనంతపురం పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో నిలిచారు. జిల్లాలో ప్రజల మొబైల్ ఫోన్లు చోరీకి గురై అవి ఏపీలోని 8 జిల్లాలతో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు వెళ్లినా ఎస్పీ అన్బురాజన్ రికవరీ చేయించారు. రూ.56 లక్షల విలువ చేసే 305 సెల్‌ఫోన్లను బాధితులకు శనివారం అందజేశారు. ఇందులో పోగొట్టుకున్నవి 271 కాగా, చోరీకి గురైనవి 34 ఉన్నాయి. ఇప్పటిదాకా 8,309 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. వీటి మొత్తం రూ.13.67 కోట్లుగా పోలీసు అధికారులు అంచనా వేశారు. సెల్‌ఫోన్లు చోరీ చేసే వారిపై ప్రత్యేక నిఘా వేసిన 'జిల్లా పోలీస్' చాట్‌బాట్ సేవల ద్వారా బాధితులకు న్యాయం చేస్తున్నారు. ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా చాట్‌బాట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సీఈఐఆర్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: మార్చి మూడో తేదీ చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి ఆదేశించారు. శనివారం జిల్లాలోని వివిధ ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు పల్స్ పోలియో కార్యక్రమంపై అనంతపురంలో శిక్షణ ఇచ్చారు. పల్స్ పోలియో ప్రాముఖ్యతను డీఎంహెచ్ఓ వైద్యాధికారులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవందించాలన్నారు. సమయపాలన పాటించడంతో ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. అనంతరం టీకాల ద్వారా నివారించగల వ్యాధుల మీద అవగాహన కల్పించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మూడ్రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ టీకా పంపిణీ చేయాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్త, ఏఎన్ఎం ద్వారా చిన్నారుల జాబితా సిద్ధం చేయాలన్నారు. మొదటి రోజు పల్స్ పోలియో చుక్కలు పొందని పిల్లలకు మిగిలిన రెండ్రోజుల్లో ఇంటింటికీ వెళ్లి అందించాలన్నారు. పోలియో చుక్కలు పిల్లల నోటిలో వేసే ముందు సూర్యరశ్మి పిల్లలకు నేరుగా తాకకుండా నీడలోనే అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గంగాధర్‌రెడ్డి, డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ మురారి, స్టోర్ మేనేజర్ రాజు, సుబ్రమణ్యం, హెచ్ఈ శ్యాముల్, రమేష్‌బాబు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏవైనా గాలికి కొట్టుకుపోవాల్సిందే

- షర్మిలను తెరపైకి తీసుకురావడానికి చంద్రబాబే మూలకారణం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సిద్ధం పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు

హిందూపురం: రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కుమ్మక్కైనా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ధాటికి గాలికి కొట్టుకుపోవాల్సిందేనని రాష్ట్ర విద్యుత్తు, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డి శనివారం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త టీఎన్ దీపిక, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బి.శాంతమ్మతో కలసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసలు తమకు పోటీనే కాదని, చంద్రబాబు కుట్రలో భాగంగానే షర్మిల ఈ రకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాష్ట్రం విడిపోవడానికి కూడా చంద్రబాబే కారణమని విమర్శించారు. షర్మిలను తాము రాజకీయ శత్రువుగానే భావిస్తున్నామన్నారు. ఆమెను తెరపైకి తీసుకురావడానికి మూల కారకుడు చంద్రబాబు అన్నారు. చచ్చిపోయిన కాంగ్రెస్ పాడె మోయడానికే షర్మిలతో పాటు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, రామచంద్రరావు లాంటివారు ఉన్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఎప్పటిలాగే ఎన్నికల కోసం మోసపూరిత హామీలివ్వడానికి మేనిఫెస్టో సిద్ధం చేసుకుంటాడని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నమ్మిన ప్రజలకు సేవలందించి పేరు నిలుపుకోవాలనే ఆలోచన కల్గిన నాయకులను ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలని, అంతేతప్ప హైదరాబాదులో ఉంటూ ఎప్పుడో ఒకసారి అలా వచ్చి చేతులూపి వెళ్లిపోయే వారిని కాదని అన్నారు. దీనివల్ల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలి


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్, చిత్రంలో కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్

అనంతపురం: కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కోర్టులో క్రిమినల్ కేసులకు సంబంధించి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల సమన్వయ కమిటీ సమావేశాన్ని జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ నిర్వహించారు. సమావేశంలో అనంతపురం కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్, శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి పాల్గొన్నారు. కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమన్వయం చేసుకునే విధానంపై రెవెన్యూ, పోలీస్ శాఖలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలు చేశారు. పోక్సో, ఇతర కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించే అంశంపై సమావేశంలో ప్రస్తావించారు.

10న జేఎన్‌టీయూలో వర్క్‌షాప్

అనంతపురం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ఈ నెల 10న వర్క్‌షాప్ ఫర్ యంగ్ అడ్వకేట్స్ పేరుతో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ముగ్గురు సుప్రీం కోర్టు జడ్జీలు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆరుగురు హైకోర్టు న్యాయమూర్తులు బార్ కౌన్సిల్ చైర్మన్, సభ్యులు హాజరవుతారు. వర్క్‌షాప్‌లో పాల్గొనే వీఐపీలకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమావేశంలో చర్చ జరిగింది. కార్యక్రమంలో అనంతపురం మునిసిపల్ కమిషనర్ మేఘ స్వరూప్, డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ శశిధర్, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

403 వీఏహెచ్ఏ పోస్టులు ఖాళీ

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్ఏ) పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఉమ్మడి జిల్లా పరిధిలో 403 పోస్టులు ఖాళీ ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీఏహెచ్ఏ పరీక్షల తరువాత రెండు విడతలుగా 442 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఆ తరువాత ఇప్పటికే పనిచేస్తున్న వీఏహెచ్ఏల బదిలీలో 171 మందికి ఉత్తర్వులు ఇచ్చారు. వచ్చేవారం కొత్త పోస్టుల భర్తీ కోసం జిల్లా వ్యాప్తంగా 403 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు ప్రకటించారు. అందులో అత్యధికంగా ఉరవకొండ డివిజన్‌లో 139 పోస్టులు, అనంతపురం డివిజన్‌లో 120, పెనుకొండ డివిజన్‌లో 59, ధర్మవరం డివిజన్‌లో 57, హిందూపురం డివిజన్‌లో 28 పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలిపారు.


ప్రాక్టికల్ మార్కులు పక్కాగా నమోదు చేయాలి

- ఎగ్జామినర్ తప్ప ఇతరులెవరూ ఉండకూడదు
- ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్


మాట్లాడుతున్న ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన మార్కులను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి వెంకటరమణనాయక్ ఆదేశించారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలలో భాగంగా తొలిసారి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఈ విధానంపై శనివారం అనంతపురంలోని ప్రభుత్వ కొత్తూరు ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎగ్జామినర్లకు శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా అన్ని జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కెమిస్ట్రీ, జువాలజీ ఎగ్జామినర్లకు ఉదయం, ఫిజిక్స్, బాటనీ పరీక్షల ఎగ్జామినర్లకు మధ్యాహ్నం అవగాహన కల్పించారు. ఇంటరాక్టివ్ ప్యానెల్ బోర్డు ద్వారా ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేసే అంశంపై నోడల్ అధ్యాపకులు క్షుణ్ణంగా తెలియజేశారు. ముందుగా ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకరమణనాయక్ మాట్లాడుతూ గతంలో ఓఎంఆర్ షీట్లలో మార్కులను బబుల్స్ చేసి నేరుగా బోర్డుకు పంపేవారమన్నారు. అయితే ఈసారి కొత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. మార్కుల నమోదులో ఒకటికి రెండుసార్లు పరిశీలించి జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఎగ్జామినర్ తప్ప ఇతరులెవరూ గదిలో ఉండకూడదన్నారు. ఏపూటకు ఆపూటే మార్కుల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఈసీ సభ్యులు శంకరయ్య, మహమ్మద్ షఫీ, జగన్నాథ్, వెంకటేశ్వరప్రసాద్, నోడల్ అధ్యాపకులు ఫిజిక్స్ లక్ష్మీరంగయ్య, నారాయణస్వామి, బాటనీ విజయలక్ష్మి, శంకర్‌గౌడ్, జువాలజీ జయరాంనాయక్, వెంకటస్వామి, కెమిస్ట్రీ నారాయణ స్వామి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ నేషనల్ మీట్‌కు ఎంపిక


ప్రణవ్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్జీఎఫ్ అండర్–17 ఫెన్సింగ్ నేషనల్ మీట్‌కు అనంపురంలోని కొత్తూరు ఒకేషనల్ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థి ఎస్ఎం ప్రణవ్‌కుమార్ ఎంపికయ్యాడు. మహరాష్ట్ర రాష్ట్రం ఔరంగబాద్‌లో ఈనెల 7 నుంచి 10 వరకు నేషనల్ మీట్ జరుగుతుందని ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. గత నవంబరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఫాయిల్ విభాగంలో ప్రణవ్‌కుమార్ స్వర్ణపతకం సాధించాడని పేర్కొన్నారు. నేషనల్ మీట్‌లో సత్తా చాటాలని ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆకాంక్షించారు.

క్లుప్తంగా

డీఆర్‌ఓ గాయత్రీదేవి రిలీవ్



అనంతపురం అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారి గాయత్రిదేవి విధుల నుంచి శనివారం రిలీవ్ అయ్యారు. ఇటీవల ప్రభుత్వం ఆమెను బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణారెడ్డిని డీఆర్‌ఓగా నియమించింది. అయితే, రామకృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టే వరకూ పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జె.రవీంద్రకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఎం.గౌతమి ఉత్తర్వులను జారీ చేశారు. ఈ క్రమంలోనే రిలీవ్ అయిన గాయత్రిదేవికి కలెక్టరేట్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

దోమకాటు నివారణ చర్యలు చేపట్టాలి



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: డెంగీ, మలేరియా ప్రబలకుండా దోమకాటు నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు పేర్కొన్నారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మలేరియా విభాగం ఉమ్మడి జిల్లా సబ్ యూనిట్ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో దోమకాటు నివారణ చర్యలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సబ్ యూనిట్ అధికారులు పీహెచ్‌సీ, సామాజిక ఆరోగ్య కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి ల్యాబ్‌లో రక్తపూతల సేకరణ తీరుకు సంబంధించిన రికార్డులను పరిశీలించాలన్నారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ మలేరియా సహాయ అధికారి లక్ష్మీనాయక్, విస్తరణ అధికారులు గిరిధర్ రెడ్డి, రమేష్, సూపర్‌వైజర్లు రమేష్‌బాబు, లోకేశ్వర రెడ్డి, ఉమ్మడి జిల్లా సబ్ యూనిట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఎక్సైజ్' అసిస్టెంట్ కమిషనర్‌గా బాలకృష్ణన్



అనంతపురం: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎన్. బాలకృష్ణన్ శనివారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనకాపల్లి 'సెబ్' అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను ఇటీవల ప్రభుత్వం అనంతపురానికి బదిలీ చేసింది.

రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలి

- క్రీడాకారులకు కలెక్టర్ గౌతమి పిలుపు
- 'ఆడుదాం ఆంధ్రా' జిల్లాస్థాయి పోటీలు విజయవంతం
- రాష్ట్ర స్థాయి పోటీలకు 114 మంది ఎంపిక



బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం: ప్రతిష్టాత్మక 'ఆడుదాం ఆంధ్రా' రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ గౌతమి క్రీడాకారులకు పిలుపునిచ్చారు. 'ఆడుదాం ఆంధ్రా' జిల్లాస్థాయి క్రీడా పోటీలు శనివారం విజయవంతంగా ముగిశాయి. అనంతపురం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 26న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయన్నారు. జిల్లాలోని 663 సచివాలయాలలో 75,882 మంది క్రీడాకారులు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 4,898 జట్లుగా ఏర్పాటు చేశామని చెప్పారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయిలో విజయవంతంగా నిర్వహించామన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో 76 జట్లు పాల్గొన్నాయన్నారు. వీరిలో పది జట్ల నుంచి ప్రతిభ కనబరచిన 114 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 9 నుంచి 14 వరకూ వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచి పతకాలతో జిల్లా కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తామన్నారు. క్రీడాకారులు అవకాశాలను అందిపుచ్చుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. విజయవంతంగా క్రీడా పోటీలు నిర్వహించిన అధికార యంత్రాంగానికి అభినందనలు తెలియజేశారు. క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం తరఫున అందిస్తామని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డీఎల్‌డీఓలు ఓబులమ్మ, శంకర్, మెప్మా పీడీ విజయలక్ష్మి, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, కబడ్డీ క్రీడాకారులు విశ్వనాథ్, రాజేశ్వరి, పీఈటీ నాగరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.



వివిధ విభాగాల్లో జిల్లాస్థాయి విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, అనంతపురం నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్ తదితరులు

అభివృద్ధి చేస్తుంటే కడుపుమంట ఎందుకు?

- సహకరించండి.. చేతకాకుంటే ఊరికే కూర్చోండి
- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ధ్వజం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరుగుతుంటే ప్రతిపక్ష నాయకులు ఎందుకు కడుపుమంటతో రగిలిపోతున్నారో అర్థం కావడం లేదని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి విమర్శించారు. శనివారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున డీఎంఎం రైల్వే గేటు వద్ద జటిలంగా మారిన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రెండున్నరేళ్లు రైల్వే ఉన్నతాధికారుల చుట్టూ తిరిగి ఆర్‌యూబీ (రైల్ అండర్ బ్రిడ్జి)ని సాధించానన్నారు. దీన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. బ్రిడ్జి ఎత్తైనా పెంచాలి, లేకుంటే ఫ్లై ఓవరైనా నిర్మించాలంటూ పనులను అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటన్నారు. రైల్వే, మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులంతా క్షేత్రస్థాయిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాకే బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలిచారన్నారు. అయినా, విపక్ష నాయకులు పెద్ద ఇంజినీర్లు అయినట్లు బిల్డప్ ఇస్తూ అరకొర జ్ఞానంతో మాట్లాడి ప్రజల్లో నవ్వులపాలవుతున్నారన్నారు. బ్రిడ్జి సాధించడంలో ఎమ్మెల్యే గొప్పతనం లేదని, ఎల్‌సీ గేట్ల మూసివేతలో భాగమేనని చెప్పుకోవడం టీడీపీ, సీపీఐ నేతల నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. గతంలో టీడీపీ నేతలు బ్రిడ్జిని ఎందుకు మంజూరు చేయించలేదని ప్రశ్నించారు. కసాపురం రోడ్డు రైల్వే బ్రిడ్జి కూడా 4.6 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, త్వరలో పనులు మంజూరు కానున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో బ్లడ్‌బ్యాంక్, ఆర్‌డీఓ ఆఫీసు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హంద్రీనీవా నుంచి పిల్లకాల్వల తవ్వకానికి రూ.42 కోట్ల మంజూరు, ముస్లిం ఖబరస్తాన్‌కు రూ.6 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం, గుంతకల్లు పోలీస్ సబ్ డివిజన్‌లోకి గుత్తి, పామిడి పీఎస్‌ల విలీనం, గుత్తి వాటర్‌గ్రిడ్, పామిడిలో నీటి సమస్య పరిష్కారం, నియోజకవర్గంలో వందలాది కిలో మీటర్ల రోడ్లు, డ్రైనేజీలు, ఆస్పత్రులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఆర్‌బీకేలు, జలకళ ద్వారా రైతులకు ఉచితంగా బోర్లు, సచివాలయాల నిర్మాణాలు తమ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని గర్వంగా చెబుతున్నానన్నారు. అభివృద్ధికి విపక్షాలు సహకరించాలని, చేతకాకపోతే ఊరికే కూర్చోవాలని హితవు పలికారు. అన్నిటికీ అడ్డు తగులుతూ మజ్జిగలో ఈగ పడేసే చందాన వ్యవహరిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి రావడం పగటి కలేనని, ఎన్నికల కోసం తెలంగాణ నుంచి వలస వచ్చిన ప్రతిపక్ష నేతలంతా చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

చంద్రబాబు చేతిలో షర్మిల కీలుబొమ్మ

ఈ నెల 10న అనంతపురంలో జరిగే 'సిద్ధం' బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా చీల్చిన కాంగ్రెస్ పార్టీలో చేరిన షర్మిల తమ నాయకుడు జగనన్న గురించి ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. చంద్రబాబు చేతిలో ఆమె కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. సమావేశంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, కౌన్సిలర్లు సుధాకర్, చాంద్‌బాషా, పార్టీ నేతలు పాల్గొన్నారు.

గుప్త నిధుల తవ్వకాల ముఠా అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

యాడికి: గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపడుతున్న ఓ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య తెలిపిన మేరకు.. గుడిపాడు కంబగిరి స్వామి దేవాలయం సమీపంలోని కొండల్లో గుప్త నిధులు ఉన్నట్లు కలలో దేవుడు చెప్పాడంటూ మండలంలోని బోయరెడ్డిపల్లె గ్రామానికి చెందిన నాగేష్ తన బంధువులకు తెలిపాడు. దీంతో గ్రామానికి చెందిన కొట్టం హరి, కొట్టం పవన్‌కుమార్, చింతగాయల నాగేష్, చింత కాయల శ్రీరాములు, చింతకాయల నాగేష్, చింతకాయల రామచంద్ర, చింతకాయల పెద్దయ్య, కొట్టం సురేంద్ర, పడమల ఓబులేసులు ముఠాగా ఏర్పడ్డారు. 3 రోజులుగా కంబగిరి స్వామి దేవాలయం వద్ద తవ్వకాలు చేపడుతున్నారు. ముందస్తు సమాచారంతో సీఐ నాగార్జున రెడ్డి శుక్రవారం రాత్రి తన సిబ్బందితో దాడులు నిర్వహించి వారిని పట్టుకున్నారు. నిందితుల నుంచి 8 సెల్‌ఫోన్లు, రెండు గడ్డపారలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన అనంతరం శనివారం నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జనవాక్కు

ప్రతి పథకంలోనూ లబ్ధి



గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక చాలా ఇబ్బంది పడేవాళ్లం. వైఎస్ జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి సిఫారసు లేకుండా అన్ని పథకాల లబ్ధి చేకూరింది. పిల్లలకు అమ్మఒడి వచ్చింది. నా భర్తకు కిడ్నీలో రాళ్లు ఉంటే ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్క రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్స చేశారు. మహిళా సంఘం ద్వారా నాకు రూ.75 వేలు, సున్నా వడ్డీ అందాయి. రైతు భరోసా వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వంలో అన్ని విధాలుగా మేలు జరిగింది. మా కష్టాలు తీర్చిన జగనన్నే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– దేవి, కరిడికొండ, గుత్తి మండలం

ఆర్థిక ఇబ్బందులు తీరాయి



మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్న నేను కూలి పనులతో జీవనం సాగిస్తున్నా. గతంలో బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను చెల్లించేందుకు నానా అవస్థలు పడ్డాను. వైఎస్ జగనన్న అధికారంలోకి రాక ముందు మా సంఘానికి రూ. 4 లక్షల అప్పు ఉండేది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏటా రూ.10 వేల చొప్పున మా రుణం మాఫీ అవుతూ వచ్చింది. నాలుగు విడతల్లో నాకు రూ.40 వేలు మంజూరైంది. వచ్చిన సొమ్ముతో ఆరు గొర్రె పిల్లలను కొనుగోలు చేసి గొర్రెల పెంపకం చేపట్టాను. ప్రస్తుతం స్వయం ఉపాధితో మా కుటుంబంలోని ఆర్థిక ఇబ్బందులన్నీ తీరిపోయాయి. మాకు గౌరవప్రదమైన జీవనం ప్రసాదించిన వైఎస్ జగనన్నకే మా మద్దతు.

– ధనలక్ష్మి, కలుగోడు, గుమ్మఘట్ట మండలం

రైతు ముంగిటకే సేవలు



గత టీడీపీ ప్రభుత్వంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందక చాలా ఇబ్బందులు పడ్డాం. విత్తనం కోసం జిల్లా కేంద్రానికి ముందురోజే వెళ్లి అక్కడే పడుకునేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్‌బీకేల ద్వారా మా ఊళ్లోనే నాణ్యమైన విత్తనం, ఎరువులు అందిస్తున్నారు. పంటల సాగులో ఏవైనా ఇబ్బందులు తలెత్తితో ఆర్‌బీకే సిబ్బంది తెలుసుకుని వెంటనే సలహాలు, సూచనలు ఇస్తున్నారు. విత్తనం మొదలు పంట విక్రయం వరకూ అన్నీ మా ఊళ్లోనే ఆరేబీకేల ద్వారా జరిగిపోతున్నాయి. రైతు కష్టాలను తీర్చిన సీఎం వైఎస్ జగన్‌కే మా మద్దతు.

– చిరుతల నాగేంద్ర, రైతు, రాప్తాడు

చేసిన మేలు ఎన్నటికీ మరువం



రాప్తాడు పోలీస్‌స్టేషన్ ఎదురుగా సెల్‌ఫోన్ మెకానిక్ షాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. జగనన్న తోడు పథకంలో భాగంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందింది. ఆ డబ్బుతో చిన్నపాటి జిరాక్స్ మిషన్ తెచ్చుకుని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నా. రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 అందుతోంది. నా కుమార్తెకు అమ్మ ఒడి పథకం వర్తించింది. గతంలో ఎన్నడూ ఇంతలా సంక్షేమ పథకాలను అందుకోలేదు. సీఎం జగన్ చేసిన మేలును మేము ఎన్నటికీ మరువం. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నా.

– రామాంజిన రెడ్డి, రామినేపల్లి, రాప్తాడు మండలం

జీఎన్‌ఎం కౌన్సెలింగ్ పూర్తి

అనంతపురం మెడికల్: డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రెండురోజులుగా జరుగుతున్న జీఎన్‌ఎం కౌన్సెలింగ్ శనివారం ముగిసింది. వివిధ నర్సింగ్ కళాశాలల్లో మొత్తం 621 సీట్లకు 844 మంది దరఖాస్తు చేసుకున్నారు. 602 మందికి నర్సింగ్ కళాశాలల్లో అడ్మిషన్ లభించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌ను డీఎంహెచ్‌ఓతో పాటు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు పర్యవేక్షించారు.

'తహసీల్దారు హత్య దారుణం'



తహసీల్దారు మృతికి సంతాపం తెలుపుతున్న కలెక్టరేట్ ఉద్యోగులు

అనంతపురం అర్బన్: విశాఖపట్నం రూరల్ తహసీల్దారు రమణయ్యను హత్య చేయడం దారుణమని రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, దివాకర్ అన్నారు. హంతకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమణయ్య మృతికి అధికారులు, ఉద్యోగులు సంతాపం ప్రకటిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సోమశేఖర్, చెన్నకేశవులు, సిబ్బంది బాషా, లీలాకాంత్, శామ్యూల్, రేఖ, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైల్వే ఉద్యోగికి తీవ్ర గాయాలు



గాయపడిన షేక్షావలి

గుత్తి రూరల్: లచ్చానుపల్లి గ్రామ శివారులో లింగాల పంపు హౌస్ వద్ద రైల్వే ఉద్యోగి ఎస్. షేక్షావలి శుక్రవారం అర్ధరాత్రి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే వర్గాలు తెలిపిన మేరకు.. గుత్తి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన షేక్షావలి గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే ఎలక్ట్రికల్ విభాగంలో టెక్నీషియన్-1గా విధులు నిర్వహించేవాడు. విధి నిర్వహణలో భాగంగా లచ్చానుపల్లి గ్రామ శివారులో ఉన్న లింగాల పంప్ హౌస్‌కు శుక్రవారం రాత్రి వెళ్లాడు. గుత్తి రైల్వే జంక్షన్‌కు నీటిని సరఫరా చేసేందుకు మోటార్ ఆన్ చేయగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసేందుకు నిచ్చెన వేసుకొని పైకి ఎక్కాడు. మరమ్మతులు చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై కిందకు పడ్డాడు. తోటి సిబ్బంది వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారు గుంతకల్లు నుంచి హుటాహుటిన వైద్య బృందంతో కలసి అక్కడికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడ్డ షేక్షావలిని చికిత్స కోసం అనంతపురం తరలించారు. వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తీసుకెళ్లారు. ఘటనపై శనివారం గుంతకల్లు రైల్వే డివిజన్ అధికారులు విచారణ చేపట్టారు.

కర్ణాటకకు సౌకర్యవంతంగా రైలు ప్రయాణం

- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌తో ఎంపీ తలారి రంగయ్య చర్చలు



కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంపీ రంగయ్య

కళ్యాణదుర్గం: రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గం, కర్ణాటక రాష్ట్రం పావగడ మీదుగా తుమకూరుకు రైలు ప్రయాణం మరింత సౌకర్యవంతం కానుంది. ఈ మేరకు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రెండు రోజుల క్రితం ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చలు జరిపారు. రాయదుర్గం నుంచి నేరుగా తుమకూరు వరకూ రైల్వే లైను సాగేలా బడ్జెట్‌లో రూ. 250 కోట్ల నిధుల కేటాయించేలా ఎంపీ చొరవ చూపారు. ఇప్పటికే రైల్వే లైన్‌లో పావగడ వరకు సిగ్నల్స్ ఏర్పాటు పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. దీంతో పాటు ట్రైన్ ట్రయల్ రన్ కూడా ప్రారంభించారు. పనులను త్వరతగతిన పూర్తి చేసి తుమకూరు వరకు రైలు నడిచేలా ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. రైల్వే లైను పనులు పూర్తైతే రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల నుంచి బెంగుళూరుకు సులువుగా రాకపోకలు సాగించవచ్చని ఈ సందర్భంగా ఎంపీ రంగయ్య తెలిపారు.

మహిళ దారుణహత్య





ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) హతురాలు లక్ష్మీనారాయణమ్మ(ఫైల్)

నార్పల: బండరాళ్లతో మోది మహిళను దారుణంగా హతమార్చిన ఘటన మండల పరిధిలోని బి.పప్పూరు గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు.. బి.పప్పూరు గ్రామానికి చెందిన నెట్టం రంగప్ప భార్య నెట్టం లక్ష్మీనారాయణమ్మ(52)కు పిల్లలు లేరు. భర్త మరణించినప్పటి నుంచి ఆమె ఒంటరిగా జీవనం సాగిస్తోంది. గ్రామంలో సొంత ఇల్లు, మూడెకరాల భూమి ఉన్నా తన పుట్టినిల్లైన బొందలవాడ గ్రామంలో నివసిస్తోంది. ప్రతి నెలా బి.పప్పూరు గ్రామానికి వచ్చి పింఛన్ డబ్బు తీసుకునేది. అందుకోసమే ఈ నెల ఒకటో తేదీన బి.పప్పూరు వచ్చిన ఆమె మళ్లీ కనిపించలేదు. బంధువులు వెతికినా ఫలితం కానరాలేదు. ఈ క్రమంలోనే తన పొలం సమీపంలోని ఓ అరటితోటలో విగత జీవిగా కనిపించింది. బండరాళ్లతో మోది హతమార్చిన అనంతరం తోటలో గోతి తీసి మృతదేహాన్ని పూడ్చిన ఆనవాళ్లు కనిపించాయి. డీఎస్పీ వెంకటశివారెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. హంతకులను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఏఈఓల డైరీ ఆవిష్కరణ



ఏఈఓల సమక్షంలో డైరీని విడుదల చేస్తున్న డీఏఓ

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈఓ) నూతన సంవత్సర డైరీని డీఏఓ ఉమామహేశ్వరమ్మ విడుదల చేశారు. శనివారం స్థానిక డీఏఓ చాంబర్‌లో అసోసియేషన్ నాయకులు ఆనంద్‌నాయక్, రియాజ్, ఆదినారాయణ తదితరుల ఆధ్వర్యంలో 2024 డైరీని ఆవిష్కరించారు.

మాస్టర్ ట్రైనీగా డాక్టర్ గోల్డ్‌స్మన్ ఎంపిక



అనంతపురం అగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉద్యోగ వర్గాలకు ఇచ్చే వివిధ రకాల శిక్షణకు స్థానిక పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (వీఏఎస్) డాక్టర్ గోల్డ్‌స్మన్ ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'ఎక్స్‌పెరిమెంటల్ లర్నింగ్ టూల్స్' పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 'రికగ్నైజ్డ్ ట్రైనర్'గా ఎంపికయ్యారు. ఇలా రాష్ట్రంలో 10 మంది, దేశ వ్యాప్తంగా 100 మందికి మించి ఉండరని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. రికగ్నైజ్డ్ ట్రైనర్ హోదాలో ఈనెల 5 నుంచి ఐదు రోజుల పాటు విశాఖపట్టణంలో జరగనున్న రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాలకు డాక్టర్ గోల్డ్‌స్మన్ హాజరవుతున్నట్లు తెలిపారు. అక్కడ రాష్ట్ర వ్యాప్తంగా కొందరు పశుశాఖ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారు. డాక్టర్ గోల్డ్‌స్మన్‌కు ఆ శాఖ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సిద్ధ విధానంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న యోగా గురువు రాజశేఖరరెడ్డి

అనంతపురం కల్చరల్: సనాతన భారతీయ సిద్ధ యోగా ఆయుర్వేద విధానంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని వక్తలు అన్నారు. సిద్ధా విధానం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ ఢిల్లీ నుంచి కన్యాకుమారి వరకు సాగుతున్న అవగాహన బైక్ ర్యాలీ శనివారం అనంతకు చేరుకుంది. స్థానిక ఆర్ట్స్ కాలేజ్ వద్ద ర్యాలీగా విచ్చేసిన వారికి వివేకానంద యోగాకేంద్ర అధ్యక్షుడు మెకవాయి రాజశేఖరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకరరెడ్డి, స్ఫూర్తి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రవిశేఖరరెడ్డి తదితరులు ఆత్మీయ స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ ఎలాంటి హాని చేయని ఈ పద్ధతులపై భారతీయులందరికీ తెలియజేస్తూ తాము 3,330 కి.మీ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సిద్ధా హెల్త్ కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగభూషణం, ఆత్రేయ కృష్ణారెడ్డి, స్ఫూర్తి గోపాలరెడ్డి పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న త్రీటౌన్ సీఐ ధరణీకిశోర్

అనంతపురం: నగరంలోని చంద్ర ఆస్పత్రి సమీపంలో వాహనదారులకు త్రీటౌన్ సీఐ ధరణీకిశోర్ శనివారం అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, 18 ఏళ్ల పైబడి ఉన్నవారే వాహనాలు నడపాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై అతిప్రేమతో మైనర్లకు బైక్‌లు, కార్లు ఇచ్చి వారిని ప్రమాదాల్లోకి నెడుతున్నారన్నారు. సైకిల్ తొక్కాల్సిన వయసులో ద్విచక్రవాహనాలు నడుపుతూ స్కూళ్లు, కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు చాలామందే ఉన్నారన్నారు. ఇలా వాహనాలు ఇవ్వడం తప్పని తెలిసే తప్పు చేస్తున్నారన్నారు.

వీఏఏ పూజితకు నివాళి



పూజిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలు

అనంతపురం అగ్రికల్చర్: బాపట్ల జిల్లాలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ)గా పనిచేస్తున్న పూజిత ఆత్మహత్య చేసుకోవడంతో సంఘం నాయకులు నివాళులర్పించారు. శనివారం స్థానిక కృషీభవన్ ఎదుట పూజిత చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు వీఏఏలు, వీహెచ్ఏలు, వీఎస్ఏలు నివాళులర్పించారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి





డ్వాక్రా సంఘాల సభ్యులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి , మామిళ్లపల్లి ఆసరా సంబరాల్లో పాల్గొన్న మహిళలు

- టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మకండి
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: త్వరలో జరగనున్న ఎన్నికల్లో అక్కచెల్లెమ్మల అమూల్యమైన ఓటుతో జగనన్నను మరోమారు ఆశీర్వదించి, సీఎం చేసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కనగానపల్లి, యలకుంట్ల, తగరకుంట, మద్దెలచెరువు, చంద్రాశ్చర్ల, మామిళ్లపల్లి గ్రామాల్లో జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల సభకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటలకు వరకు జరిగిన ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.

జగనన్నను మరోమారు ఆశీర్వదించాలి..

వైఎస్సార్ ఆసరా సంబరాల సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు సంబంధించిన రూ.25,500 కోట్ల డ్వాక్రా రుణాలన్నీ నాలుగు విడతల్లో మాఫీ చేశారన్నారు. దీంతో పాటు సున్నా వడ్డీ పథకం మరో రూ.5,500 కోట్లు డ్వాక్రా మహిళల పొదుపు ఖాతాల్లో జమ చేశారన్నారు. వీటితో పాటు అమ్మఒడి, వైఎస్సార్ చేయూత పథకాల ద్వారా సుమారు రూ.2.5 లక్షల కోట్లు మహిళ ఖాతాల్లో జమ చేశారన్నారు. పలుమార్లు బటన్ నొక్కి నేరుగా మీ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసిన జగనన్నకు మరోమారు ఓటు వేసి ఆశీర్వదించాలన్నారు.

టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మకండి..

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లోకొచ్చి మాయ మాటలు చెపుతున్న టీడీపీ నాయకులను నమ్మొద్దని ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు 600 అబద్ధపు హామీలు ఇచ్చి.. ఆ తర్వాతా అధికారంలోకొచ్చాక ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. దీంతో 2019లో అధికారం కోల్పోయిన ఆయన మరోమారు అబద్ధపు హామీలతో ప్రజలకు ముందుకు వచ్చి మోసం చేయాలని చూస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వంద రోజులకే పేరూరు డ్యాంకు కృష్ణా జలాలను తెచ్చి, రాప్తాడు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశామన్నారు. పీఏబీఆర్ ద్వారా నియోజకవర్గంలోని పలు గ్రామాలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 25 వేల మంది మహిళలకు ఇళ్లు, స్థలాలు మంజూరు చేయించటంతో పాటు 50 వేల మందికి పింఛన్లు, 2 వేల మంది రైతులకు బోర్లు వేయించామన్నారు. 25 ఏళ్ల పాటు ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేలు, మంత్రులుగా కొనసాగిన పరిటాల కుటుంబ సభ్యులు ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంత్రి పథకం ఏసీ రామేశ్వరరెడ్డి, ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, మండల అగ్రి బోర్డు చైర్మన్ వెంకటరాముడు, సొసైటీ అధ్యక్షుడు భాస్కర్, డైరెక్టర్ ప్రభాకర్, ఏపీఎం హేమలత, ఈఓఆర్డీ అనిల్ కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే జగన్ లక్ష్యం



ఏ.నారాయణపురంలో వైఎస్సార్ ఆసరా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తేనే కుటుంబాలు కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని, గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళాసాధికారతకు పెద్దపీట వేస్తున్నారని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనవారం ఏ నారాయణపురంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరై నియోజకవర్గ పరిదిలోని ఏ నారాయణపురం, రుద్రంపేట, రాజీవ్‌కాలనీ, అనంతపురం రూరల్ పంచాయతీల పరిధిలోని డ్వాక్రా మహిళలకు రూ.5.14 కోట్ల మెగా చెక్కు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతపురం నియోజకవర్గంలోనే నాలుగు విడతల్లో దాదాపు రూ.101 కోట్ల డ్వాక్రా రుణాల మాఫీ చేసినట్లు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అపద్ధాలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నాడన్నారు. 2024 ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న యుద్ధమని ఎమ్మెల్యే అన్నారు. అపద్ధాలు, మోసాలకు పాల్పడే గజదొంగల ముఠా ఓ వైపు ఉంటే.. నిత్యం పేద ప్రజల సంక్షేమం కోసం తపించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో వైపు ఉన్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఆశాబీ, ఉదయ్‌శంకర్, పద్మావతి, ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు సంధ్య, ఆశాజ్యోతి, నాగేంద్ర, మహబూబ్‌జాన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రూరల్ మండల కన్వీనర్ హుస్సేన్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సోమర జయచంద్రానాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణుగోపాల్, ఉమ్మడి జగన్‌మోహన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సత్తెన్న, హాజీవలి తదితరులు పాల్గొన్నారు.



ఏ నారాయణపురంలో జరిగిన వైఎస్సార్ ఆసరా సభకు హాజరైన డ్వాక్రా సంఘాల మహిళలు

అందరి సహకారంతో అభివృద్ధిబాట



కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ ఎం.లిఖిత, డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, సీఈవో రామ్‌ప్రసాద్ తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: చరిత్రాత్మక నేపథ్యం కలిగిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) 105 ఏళ్లు పూర్తి చేసుకొని 106వ వసంతంలోకి అడుగిడినట్లు బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత తెలిపారు. శనివారం స్థానిక డీసీసీబీ హాలులో అధికారులు, సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేసి ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ 105 ఏళ్ల కింద ఏర్పాటైన సహకార బ్యాంకులు దినదినాభివృద్ధి చెందుతూ, తన చారిత్రాత్మక వైభవాన్ని కోల్పోకుండా నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రైతులకు పెద్దపీట వేస్తూనే మిగతా అన్ని వర్గాలు, అన్ని రంగాల అభ్యున్నతికి బ్యాంకింగ్ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు కూడా ఆర్‌బీకే వేదికగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి వివిధ రైతు పథకాలు, కార్యక్రమాల్లో సహకార బ్యాంకులను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లు, యంత్రీకరణకు సంబంధించి కమ్యూనిటీ హైయరింగ్ సెంటర్లు, మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ల కింద గోడౌన్ల నిర్మాణాలు, జగనన్న పాలవెల్లువ, తదితర వాటికి రుణ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఆప్కాబ్, నాబార్డు సహకారంతో సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో డైరెక్టర్ వై.జనార్దన్‌రెడ్డి, నాబార్డు డీడీఎం అనురాధ, సీఈవో ఏబీ రామ్‌ప్రసాద్, జీఎం కె.సురేఖారాణి, డీజీఎం సుఖదేవబాబు, ఏజీఎంలు, బ్రాంచి మేనేజర్లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

నేడు బసంపల్లిలో ఆసరా సంబరాలు

కనగానపల్లి (చెన్నేకొత్తపల్లి): చెన్నేకొత్తపల్లి మండలంలోని బసంపల్లి గ్రామంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు ఆదివారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన జరిగే ఈ సంబరాల్లో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

శానిటరీ ప్యాడ్స్ వెండింగ్ మిషన్ ప్రారంభం



ఆటోమేటిక్ శానిటరీ ప్యాడ్స్ వెండింగ్ మెషిన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా కోర్టు ఆవరణలో సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళల సౌకర్యార్థం ఆటోమేటిక్ శానిటరీ ప్యాడ్స్ వెండింగ్, బర్నింగ్ మెషిన్ ఏర్పాటు చేశారు. ఫ్యామిలీ కోర్టు, అడిషనల్ జిల్లా జడ్జి పి. హరిత, పోక్సో కోర్టు న్యాయమూర్తి టి. రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ సివిల్ జడ్జి నిర్మల తదితరులు ప్రారంభించారు. సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయి కుమార్ తల్లి రుక్మిణి రూ.60 వేలు, బెంగళూరుకు చెందిన సింధూర ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీస్ సహకారంతో ఈ మిషన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఓ భాగ్యలక్ష్మి, కోర్టు మేనేజర్ మాధవి లత, సింధూర ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ప్రతినిధి చిన్న రావు, సాయి ట్రస్ట్ సభ్యులు రాఘవేంద్ర, నారాయణ నాయక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

22 నుంచి న్యాక్ పీర్ కమిటీ పర్యటన



న్యాక్ పీర్ మాక్ టీం సభ్యులను సన్మానిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ జీవీఆర్ శ్రీనివాస రావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో న్యాక్ పీర్ కమిటీ ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు పర్యటించనుంది. రెండు రోజుల నుంచి న్యాక్ కమిటీ తరహాలోనే నిపుణులైన ప్రొఫెసర్లతో న్యాక్ మాక్ టీంను ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. న్యాక్ మాక్ టీం ఆయా విభాగాలను పరిశీలించింది. సెల్ఫ్‌స్టడీ రిపోర్ట్ ఆధారంగా అన్ని అంశాలను అధ్యయనం చేసి బహిర్గతమైన లోపాలను సరిదిద్దుకోవాలని కమిటీ సిఫార్సు చేసింది. ప్రొఫెసర్ టి. త్యాగరాజన్ (అన్నా యూనివర్సిటీ, చెన్నై), ప్రొఫెసర్ ఎంజీ సేతు రామన్ (మెంబర్ సెక్రటరీ, స్కూల్ ఆఫ్ సైన్సెస్ ద గాంధీగ్రామ్ రూరల్ ఇనిస్టిట్యూట్) ప్రొఫెసర్ ఆర్. ముత్తన్ (మెంబర్ ప్రొఫెసర్ ఎమినెన్స్ అన్నా యూనివర్సిటీ) న్యాక్ మాక్ టీంలో ఉన్నారు. రెండో రోజు శనివారం ఆయా విభాగాల్లో అనుకూల, ప్రతికూల అంశాలను వివరించేందుకు మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సెమినార్ హాలులో సమావేశం ఏర్పాటు చేశారు. వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి . శశిధర్ , ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి తదితరులు పాల్గొన్నారు.

29న ప్రజాచైతన్య సభ



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: ప్రజా రక్షణ సమితి (పీఆర్ఎస్) ఆధ్వర్యంలో ఈనెల 29న ప్రజా చైతన్య సభ ఉంటుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు తెలిపారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ప్రజా చైతన్య సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మధు మాదిగ, జంగం అంజి, ఆంజనేయులు, కుళ్లాయప్ప, హనుమంతు, ఇమామ్ షరీఫా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆత్మకూరులో 'ఆసరా' సభ



ఆత్మకూరులో ఆసరా సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: మండల కేంద్రంలో ఆసరాసభ భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శనివారం తెలిపారు. ఆసరా కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. ఐదు వేల మందితో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా ఆత్మకూరులో పైప్‌లైన్ పనులకు భూమి పూజ చేసి, అనంతరం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముట్టాల లో ఆర్‌బీకే, సచివాలయం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని మహిళలు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, నాయకులు మదిగుబ్బ వీరాంజనేయులు, నాగరాజు, అతిక్‌రెడ్డి, ముత్యాలరెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్ , అంజినప్ప, మహేష్, వన్నూరప్ప, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్ఈ భాగ్యవతి సేవలు చిరస్మరణీయం



ఎన్ఈ భాగ్యవతి (ఫైల్)

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వయోజన విద్యాశాఖ (అడల్ట్ ఎడ్యుకేషన్) ఫౌండర్ ప్రొఫెసర్ ఎన్ఈ భాగ్యవతి సేవలు చిరస్మరణీయమని విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ అన్నారు. విశ్రాంత ప్రొఫెసర్ ఎన్ఈ భాగ్యవతి (80) మదనపల్లిలో మరణించారు. వర్సిటీ వయోజన విద్యాశాఖ విభాగంలో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. వర్సిటీకి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీచింగ్ అసిస్టెంట్లు డాక్టర్ గద్దం వాసుదేవయ్య, డాక్టర్ జి. ప్రతాప్, డాక్టర్ హెచ్‌టీ తిప్పేస్వామి, డాక్టర్ జి. వెంకటలక్ష్మి, బోధనేతర ఉద్యోగి ఎం. లోక్‌నాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్: నగర ప్రజలకు సరఫరా చేసే తాగునీటి మెయిన్ పంపింగ్ పీఏబీఆర్ డ్యామ్ వద్ద ఉన్న మోటార్లు మరమ్మతులు కారణంగా వారం రోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎస్ఈ రామమోహన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలకు రోజు మార్చి రోజు తాగునీరు సరఫరా అవుతుందన్నారు. నగర ప్రజలు గమనించి తాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు.


ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందంటూ ఆయా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద బడ్జెట్ ప్రతులను నాయకులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అన్యాయం జరిగిందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బడ్జెట్ కేటాయింపు ఉన్నాయన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గింపు, ఎరువుల సబ్సిడీ తగ్గించి అన్యాయం చేసిందన్నారు. కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న జరగబోవు గ్రామీణ బంద్‌ను, పారిశ్రామిక సమ్మెను ప్రజలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముస్కిన్, పోతులయ్య, రాహుల్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సుబ్బిరెడ్డి, ఆదినారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని యువకుడు మృతి



శివ మృతదేహం

అనంతపురం: నగర శివారులోని డీమార్ట్ సమీపంలో టిప్పర్ ఢీకొని కణేకల్లు మండలం హనుమాపురానికి చెందిన శివ అనే యువకుడు శనివారం రాత్రి మృతి చెందాడు. ద్విచక్రవాహనంపై వెళ్తున్న అతన్ని వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

కనగానపల్లి: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో వద్ద శనివారం పీఆర్‌టీయూ నాయకులు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవి చేతుల మీదుగా వీటిని ఆవిష్కరించి ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు రంగారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతాం



అంబేడ్కర్‌నగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: త్వరలో ఎన్నికలు రాబోతున్నాయని, మరో అవకాశం ఇచ్చి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే అనంతను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని 21వ డివిజన్ అంబేడ్కర్‌నగర్, మున్నానగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, తదితర ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేకూరిన సంక్షేమ లబ్ధి, అభివృద్ధి పనులపై కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

కుట్ర రాజకీయాలను తిప్పికొట్టాలి:

పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంస్కరణలు తీసుకొస్తే.. ఎలాగైనా ప్రజలకు మేలు జరగకూడదన్న దుర్బుద్ధితో ప్రతిపక్షాలు కు ట్ర రాజకీయాలు చేస్తున్నాయని ఎమ్మెల్యే అన్నా రు. ఎవరెన్ని కుట్రలు చేసినా, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ వైపు ప్రజలు మొగ్గుచూపుతారన్నారు. అనంతరం తాము సైతం సిద్ధం పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న, టీటీడీ పాలక మండలి సభ్యుడు అశ్వర్థనాయక్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, కార్పొరేటర్లు సాకే చంద్రలేఖ, సుమతి, దుర్గాదేవి, లావణ్య, అబూసలేహ, సాకే చంద్ర, ఇసాక్, శ్రీనివాసులు, టీవీ చంద్రమోహన్ రెడ్డి, గురుశేఖర్‌బాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు అనంత చంద్రారెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, కొర్రపాడు హుస్సేన్ పీరా, కృష్ణవేణి, క్లస్టర్ అధ్యక్షులు మధు, ఓబిరెడ్డి, నాయకులు పెన్నోబులేసు,సాకే కుళ్లాయి స్వామి, తిరుపతినాయుడు, రాజునాయక్, రాధాకృష్ణ, చింతకుంట మధు, రామయ్య, మారుతీనాయుడు, తలారి వెంకటేష్, జాహ్నవి రెడ్డి, మునీర, సుహాసిని, భారతి, సుజాత రెడ్డి, రాధాయాదవ్, పార్వతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీటీసీ వీర్రాజు

- ఉప రవాణా కమిషనర్ వీర్రాజు పిలుపు

అనంతపురం సెంట్రల్: రహదారి భద్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఉప రవాణా కమిషనర్ వీర్రాజు పిలుపునిచ్చారు. శనివారం రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా రవాణాశాఖ కార్యాలయంలో వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు. డీటీసీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించడమే పరిష్కారమన్నారు. ఎవరు తప్పు చేసినా ప్రమాదాలు జరుగుతాయని, అమాయకులు కూడా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డుపైకి వాహనంతో వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం ప్రమాదకరమన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలకు వాహనాలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వాహన యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. బ్లాక్‌స్పాట్స్ గుర్తించి వాటి మరమ్మతులు చేపడుతోందన్నారు. క్షతగాత్రులను కాపాడేందుకు 'గుడ్ సమర్థియాన్' కార్యక్రమం పేరుతో ప్రాణాలు కాపాడిన వారికి ప్రోత్సాహక నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందజేసి, గౌరవిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐలు రమణారెడ్డి, శ్రీనివాసులు, సునీత, సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.